# దైవము మానవులకు ఆదర్శమును నిరూపించే నిమిత్తమై అనేక లీలలు ప్రదర్శిస్తాడు

మంచికాలము మంచిపదవులు మంచిబ్రతుకు
కోరుచుందురు మనుజులు కోరబోరు
మంచిబుద్ధులు జ్ఞానంబు మంచినడత.
కన్నులనిచ్చిన దెందుకో తెలుసా
అన్నియు చూచేటందులకా? కాదుకాదు
దేవాధిదేవుడౌ కైలాసవాసుని కన్నులారగాంచేటందుకు.
పొందుగ పాదములిచ్చినదెందుకు
సందులుగొందులు తిరుగుటకా? కాదుకాదు
నందివాహనుని మందిరమున కేతెంచుటకు.

ప్రేమ స్వరూపులారా!

ఈనాడు దేశమునకు కావలసినది ఆదర్శము. దివ్యమైన సాంఘిక ఆదర్శములు యీనాడు లోకమునకు అత్యవసరము. ఒక్కొక్క విషయమునందు, ఒక్కొక్క రంగమున, ఒక్కొక్క వ్యక్తి ఆదర్శప్రాయుడు కావచ్చును. కానీ అన్నిరంగములందు ఆదర్శ ప్రాయుడైన వ్యక్తి యీ లోకములో అరుదు. అది ఒక్క దైవమునకుతప్ప అన్యులకు అలవడదు. రాజకీయముగా, సాంఘికముగా, ధార్మికముగా, ఆధ్యాత్మికముగా ఆదర్శమును నిరూపించి లోకమునకు అనేక విధములుగా ప్రేమతత్త్వమును ప్రకటింపచేసి, తాను దివ్యమైన రూపమని నిరూపించిన వ్యక్తి, శ్రీ కృష్ణ పరమాత్మ.

srisathyasaivachanamrutam

**భగవంతుడు మానవులకు ఆదర్శమును నిరూపించే నిమిత్తమై అల్ప విషయములందుకూడను ఉన్నతాదర్శములు ప్రదర్శిస్తాడు**

కృష్ణుడు కేవలము యుద్ధోన్మాదియని, ప్రేమశీలుడు కాదని అనేకమంది వాదోపవాదములు చేసుకుంటూవుంటారు. నిజానికి, శాంతికాముకుడు, కృష్ణుడు. అట్టి భగవత్‌తత్త్వము అందరికి గుర్తించటానికి వీలుకాదు. ఈనాడు దైవమును దైవముగా విశ్వసించి, ఆరాధించటం మాత్రమే నేర్చుకున్నారు కాని దైవమునందున్న ఆదర్శప్రాయమైన మానవత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించుట లేదు. మానవులమధ్య జన్మించి, మానవాకారాన్ని ధరించిన మాధవునియందు మానవత్వాన్ని గుర్తించినప్పుడే మానవుడు సార్థకం కాగలడు. కృష్ణునియందు యీ ఆదర్శప్రాయమైన మానవ చిహ్నములు యెక్కడెక్కడ వున్నవని మనం కొంత విచారించాలి.

మహాభారత యుద్ధము భయంకరముగా జరుగుచున్నది. ఒక్కొక్కరు ఒక్కొక్కవైపు యుద్ధములో ప్రవేశించారు. పాండవులలో ధర్మజుడు కర్ణుని యెదుర్కొని అనేక విధములైన యుద్ధములు సల్పుతూవున్నాడు. కానీ, కర్ణుని అస్త్రములకు ఓర్వలేక ఛిన్నాభిన్నముగా చెదరిపోతున్నది, పాండవుల సైన్యము. ధర్మజుడుకూడను అలసిపోయాడు. అతనిలో పోరాడే శక్తిసామర్థ్యములు, క్షణక్షణమునకు సన్నగిల్లుతూవచ్చాయి. సైన్యము నలుదిక్కులా చెదరిపోయారు. చేయునది లేక ధర్మజుడుకూడను తన గుడారమునకు వెళ్లాడు. ఈ పరాభవమును సహించుకోలేక అనేక విధముల బాధపడుతున్నాడు ధర్మజుడు. ఇంతలో అర్జునుడు ప్రవేశించాడు. అర్జునుని చూడగనే మండి పడ్డాడు, ధర్మజుడు. 'నీ శక్తిసామర్థ్యములు, నీ గాండీవముయొక్క శక్తి నిరుపయోగమని' నిందించాడు. ఇంకా అనేక విధములుగాకూడను అర్జునుని నిందించటానికి ప్రయత్నించాడు. అర్జునుడు సహించుకొనలేక గాండీవమునెత్తి ధర్మజుని కొట్టటానికి ప్రయత్నించాడు. క్షణములోనే కృష్ణుడచ్చట ప్రత్యక్షమయ్యాడు. అర్జునుని సముదాయించాడు. 'అర్జునా! నీ అన్నయైన ధర్మజుని యీ విధముగా అవమానపరచటం న్యాయంకాదు. పెద్దలను గౌరవించటం, వారియొక్క గౌరవాన్ని నీవు అందుకోటం యిది సోదరులయొక్క ప్రధానమైన లక్ష్యము. నీ

sri sathyasai vachanamrutam

లక్ష్యాన్ని నీవు విస్మరించి, ఐహికమైన వాక్కులచేత నీవు ద్వేషమును పెంచుకొని పెడమార్గమును పట్టటం న్యాయంకాద'ని కృష్ణుడు అర్జుననకు చక్కగా బోధించాడు. ధర్మజుని లోపలకు పంపాడు. ఇంకా అనేక విధములుగాకూడను అర్జునుని ఓదార్చి అతనికి చక్కని ధర్మబోధలను చేశాడు. కృష్ణుడు చెప్పిన వాక్యములను ఆలకించి అర్జునుడు శాంతుడై తన గుడారమునకు వెళ్లాడు.

ఇంతలో కృష్ణుడు ధర్మజుని గదికి వెళ్లి ధర్మజుడు విచారముతో వుండినటువంటి సమయము చూచుకొని అతని రెండు కాళ్లను గట్టిగా పట్టుకున్నాడు 'ధర్మజా! పెద్దవాడవైన నీకు యీవిధమైన తొందర మంచిది కాదు. సోదరుడైన అర్జునుని దూషించటము మంచిదికాదు. యివి ఆవేశముతోకూడిన మాటలే కాని, అన్యము కాదు. దేశానికి ఆదర్శవంతముగా నిరూపిస్తున్న పాండవులలోపల యీ ప్రేమతత్త్వము ఛిన్నాభిన్నము కాకూడదు. పాండవులు ఆదర్శసోదరులనే సార్థకనామాన్ని మీరు నిల్పుకోవాలి. కనుక, నీవు తక్షణమే వెళ్లి అర్జునుని మన్నించుమని కోరుకొమ్మ'న్నాడు. ఈ బోధలను విని ధర్మరాజు కంటినీరు కార్చాడు. 'స్వామీ! లోకారాధకుడవైన నీవు తుచ్ఛుడనైన నాపాదములు పట్టుకోటం నాకు చాలా అవమానంగా వుంది. నన్ను క్షమించు'మని తన పాదములను పట్టి ప్రార్థించి తక్షణమే కృష్ణునియొక్క ఆజ్ఞను పురస్కరించుకొని అర్జునుని దగ్గరకు వెళ్లి చేతులు పట్టుకొని, 'తమ్ముడా! నన్ను క్షమించు'మని ప్రార్థించాడు. భగవంతునియొక్క దృష్టితో చూచినవానికి యివి చాలా అల్పంగా తోస్తుంటాయి. భగవంతుడైన కృష్ణుడు యీవిధమైన అల్పవిషయములలో ప్రవేశించటం సరికాదనికూడను కొంతమంది నిందించవచ్చును. కాని, భగవంతునియందుండిన మానవ ఆదర్శములు యిలాంటి చిన్నచిన్న విషయములందుకూడను తాను నిరూపించి బోధిస్తూవుంటాడు. భక్తులపై వున్న ప్రేమాతిశయంచేత అనేక విధములైన చేయరాని పనులుకూడా భగవంతుడు చేస్తూవుంటాడు. స్వార్థరహితమైనకర్మ అది. లోకకళ్యాణమునకై ఆచరించే కర్మలు. సమాజమునకు ఆదర్శమును నిరూపించే పవిత్రమైనకర్మలు. తోటి మానవులకు ఆదర్శమును నిరూపించుటకై భగవంతుడుకూడను అల్పవిషయములందు ప్రవేశించి అనంతమైనబోధలు సల్పుతూవుంటాడు. దైవము వినయ విధేయతలు

నిరూపిస్తూవుంటాడు. సమయం వచ్చినప్పుడు తాను నిర్దాక్షిణ్యంగా, కఠినముగాకూడను మాట్లాడుతూ వుంటాడు. వున్న సత్యాన్ని స్పష్టంగా వివరిస్తుంటాడు.

యుద్ధానంతరము ధర్మజుడు రాజసూయయాగం చేయాలని సంకల్పించున్నాడు. ప్రజలందరు దీనికంగీకరించారు. గురువులైన వశిష్ఠ, విశ్వామిత్రులుకూడను అంగీకరించారు. ఋషులందరు యీ యాగమునకు సమ్మతించారు. కాని ధర్మరాజు యెట్టి చిన్న కార్యంకూడా కృష్ణుని ఆజ్ఞ, అనుగ్రహం లేనిదే చేయడు. అందువలన, కృష్ణునియొక్క ఆజ్ఞ నిమిత్తమై కాచుకొని వున్నాడు. అర్జునుని పంపి కృష్ణుని పిలిపించుకున్నాడు. తనయొక్క ఆశయాన్ని చక్కగా విప్పిచెప్పాడు. కృష్ణుడు నవ్వి 'బావా! యిది నీకు తగనిది. ఏకచ్ఛత్రాధిపత్యము కల్గిన రాజు మాత్రమే యీ యాగము చేయటానికి అధికారి. నీవు ఏకచ్ఛత్రాధిపతివి కాదు. శిశుపాలుడు, దంతవక్రుడు, జరాసంధుడు యిలాంటి వారంతావున్నారు. మహాబలవంతులైన రాజులుండగా నీవు రాజసూయయాగం చేయటానికి నీకు యేమాత్రం అధికారం లేద'ని ఖచ్చితంగా చెప్పి నివారించటానికి ప్రయత్నించాడు. ఎట్టి సమయమునందు కూడను కాల, కర్మ, కారణ, కర్తవ్యాలను పురస్కరించుకొని ప్రబోధించే సత్య స్వరూపుడు, కృష్ణుడు. నీకు రాజసూయయాగము చేయటమే యిష్టమైన యీ మూడు రాజ్యములను జయించమన్నాడు. ఈ వాక్యాన్ని పురస్కరించుకొని ప్రజలలోపల 'కృష్ణుడు యుద్ధోన్మాది' అని ప్రచారం జరిగింది, కొంతవరకు. యుద్ధము చేయమని కాదు, కృష్ణుడు చెప్పటము. రాజసూయానికి తగిన అధికారాన్ని పొందమని చెప్పాడు. అప్పుడు ధర్మజుడు తన సోదరులతో కూడి శిశుపాలుని, దంతవక్రుని, జరాసంధుని జయించాడు.

**నాయకుడైన వ్యక్తి అన్నిటియందు నాయకత్వము వహించాలి**

రాజనీతియందుకూడను కృష్ణునియొక్క ఆదర్శమును మనం చక్కగా విచారించాలి. రాజసూయయాగము ప్రారంభించాడు, ధర్మజుడు. ఒక్కొక్క సోదరునికి ఒక్కొక్క పనికి జవాబుదారి అందించాడు. ఆ సమయములోపల కృష్ణుడుకూడను ధర్మరాజువద్దకు వచ్చి చేతులు కట్టుకొని నిల్చున్నాడు. 'ధర్మజా! లోకరీతిగా నీవు ప్రభువు. నేను నీ పాలనలో

sri sathyasaivachanamrutam

వుండేవాడను. కనుక నాకు యేదైనా ఒక సేవ అందించమ'ని కోరాడు. కృష్ణుడు పలుకుచున్న యీ పలుకులచేత ధర్మరాజుకి చాలా బాధ కల్గింది. 'సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమయుడు అయిన కృష్ణుడా యీ విధమైన కోరికను కోరటం! కృష్ణా! యీ రాజ్యము నీది కాదా! నేను నీవాడను కాదా! సర్వమూ నీ వలననే నాకు ప్రాప్తించింది. కనుక నీవే రాజువు. నేను అల్పుడిని' అన్నాడు. అప్పుడు కృష్ణుడు 'ధర్మజా! భక్తి ప్రపత్తులందు నీవు చెప్పిన మాట నిజమే! కానీ, లోక సంబంధమైన విషయములందు మాత్రము రాజనీతి నియమములను మాత్రమే అనుసరించాలి', అన్నాడు. దైవత్వమునకు సంబంధించిన నియమములు కొన్ని, మానవత్వమునకు సంబంధించిన విషయములు కొన్ని, ఆనాడుకూడను వుంటున్నవి. Individual freedom అనేది ఒకటి, Fundamental Law అనేది ఒకటి. ఇది రాజ్యమునకు సంబంధించిన విషయము కనుక యే విధమైతేనేమి నాకొక సేవను అందించమన్నాడు కృష్ణుడు. అప్పుడు ధర్మజుడు చెప్పాడు 'బావా! నీకేది యిష్టమో అది నీవు తీసుకో'మన్నాడు. 'నాకు యిష్టమైనదానిని నేను తీసుకోవటానికి నేను నిన్ను అడగనక్కరలేదు. నీకు యిష్టమైన పని యేదో చెప్పు అది చేస్తాను', అన్నాడు. కడపటికి యిరువురి మధ్య వాదోపవాదములు జరిగి కాలమును వ్యర్థపరచక కృష్ణుడు 'వచ్చిన పండితులందరికి పాదములు కడిగి, వారిని తాను ఆహ్వానము చేయటానికి సిద్ధముగా వున్నా'నన్నాడు. ఇది అహంకార నిర్మూలనకు చక్కని ఆదర్శము. మానవాభ్యుదయమైన ఆదర్శము యిక్కడ అత్యవసరము. ఇంతశక్తిమంతుడైన శ్రీ కృష్ణుడు యీవిధమైన అల్పకార్యములో ప్రవేశించటమా అనే విషయాన్ని మనము విచారించరాదు. లీడరైన వ్యక్తి అన్నిటియందు తాను లీడ్ చెయ్యాలి. మానవులకు ఆదర్శమును నిరూపించే నిమిత్తమై కృష్ణుడు ప్రతిరంగమందు, ప్రతివిషయమునందు యీ విధమైన ఆదర్శమును అందిస్తూవచ్చాడు. పాండవులపైనున్న ప్రేమవల్ల, వారి సోదరత్వము ఛిన్నాభిన్నము కాకుండా వుండే నిమిత్తమై, అనేక పర్యాయములు తాను కాపాడుతూ యీ విధమైన ఆదర్శాన్ని నిరూపించాడు.

యుద్ధమునకు పూర్వము కృష్ణుని రాయబారిగా పంపుటకు అందరూ అంగీకరించారు. కృష్ణునకు, పాండవులకు మధ్యగల సన్నిహిత సంబంధబాంధవ్యమనేది హృదయం

sri sathyasai vahini

చేరినటువంటిది. కేవలము బంధుత్వముతో చేరిన సంబంధంకాదు. కృష్ణునికి పాండవులపై యెంత ప్రేమయో, పాండవులకుకూడను కృష్ణునిపై అంత ప్రేమ. విధిలేక కృష్ణుని తప్ప యింకొకరిని పంపుటకు వీలులేక పోయింది. కనుక, పాండవులకు రాయబారిగా హస్తినాపురం చేరాడు. కృష్ణునికి స్వాగతం చేసే నిమిత్తమై దుర్యోధన దుశ్శాసనాదులు కుట్రతో కుత్సితమైన ప్రేమచేత అనేకరకములైన వైభవములను నిర్మించారు. కృష్ణుడు రథమునుండి దిగేటప్పటికి దుర్యోధన దుశ్శాసనులు తమ వసతి గృహములోనే నివసింపవలెనని, తమ ఆతిథ్యమును స్వీకరింపవలెనని ప్రార్థించారు. అక్కడకూడను సోదరులకు రాజనీతిని చక్కగా బోధించాడు, కృష్ణుడు: "దుశ్శాసనా! నేను రాయబారిగా వచ్చినవాడను. నా కార్యము పూర్తి అయిన తరువాతనే నేను నీయొక్క అతిథిగా వుంటాను, అంతవరకు వుండుటకు వీలుకాద"న్నాడు. ఇది ఫలించిన తరువాతనే విందు ఆరగిస్తానన్నాడు. అంతకు పూర్వము నేను మీ వసతి గృహమును, మీ విందును స్వీకరించుటకు వీలు కాదన్నాడు. ఈ విధంగా కఠినంగా చెప్పి రాజనీతి వారి దృష్టికి తెప్పించి విదురుని యింటికి వెళ్లాడు. ఈనాడు సామాన్య మానవులు భావించినట్లుగా విదురుడు కూడను అట్లే భ్రమించాడు. "కృష్ణా! సర్వజ్ఞులైన, సర్వశక్తిమయులైన మీరు యీ అల్పకార్యమునకు యెట్లు అంగీకరించారు? పాండవులు యే రీతిగా మిమ్ము పంపినారు? కౌరవులు చాలా దుర్మార్గులు. దుష్టబుద్ధిచేత అనేక చిత్రములు పన్ని తమను యెన్ని విధములైన హింసలకైనా గురిచేయగలరు. ఇన్ని తెలిసికూడా మీరు యేవిధముగా ఇక్కడకు వచ్చార"ని ప్రశ్నించాడు. అప్పుడు కృష్ణుడు చెప్పాడు, "విదురా! నాకు తెలియని విషయంకాదిది. ప్రజాక్షేమ నిమిత్తమై లోక కళ్యాణ నిమిత్తమై, నేను అనేక విధములైన పనులు చేయవలసివస్తుంది. నా తత్త్వమును యెవరూ గుర్తించలేరు. నా భావములన్నీకూడను ధర్మసంస్థాపన నిమిత్తమై! నేను పవిత్రమైన పాండవుల అన్యోన్యతకు యేమాత్రము అడ్డు రాకూడదు. ఆ కుటుంబముయొక్క యేకత్వాన్ని సంరక్షించటము నా ప్రధాన కర్తవ్యము. పాండవులయందున్న సోదరత్వమే ఛిన్నాభిన్నమైన జగత్తును కాపాడగలదు. ఇట్టి లోకకళ్యాణ నిమిత్తమై యెట్టి కార్యమునందుకూడను నేను ప్రవేశించుటకు సిద్ధమే" అన్నాడు.

విందారగించి సభలో ప్రవేశించాడు. అక్కడకు వెళ్లిన తక్షణమే కృష్ణునికి ఉన్నతాసనం చూపించారు, దుర్యోధన దుశ్శాసనులు. కృష్ణుడు సభలో ప్రవేశించిన తక్షణమే ఆసభలో వున్న ఋషులు, రాజులు, సామంతులు, అందరు లేచి నిల్చున్నారు. భీష్ముని, ద్రోణాచార్యుని సహాయంచేత ధృతరాష్ట్రుని కృష్ణుని దగ్గరకు తెచ్చి చేతులు పట్టుకొని స్వాగతం చేయించి, ఉన్నతాసనం పైన కూర్చోమని కోరాడు. అక్కడ కృష్ణునియొక్క సంభాషణలు మానవునికి ఆదర్శవంతములుగా నిరూపిస్తూవచ్చాయి. "రాజా! ప్రజలు కూర్చుండిన తరువాతనే నేను కూర్చుంటాను. కాని, దానికి ముందు నేను రాయబారిగా వచ్చిన కార్యాన్ని మొట్టమొదట జరపాలి" అన్నాడు.

ధృతరాష్ట్రునివైపు తిరిగి "రాజా! నీ ఆజ్ఞానుసారము పాండవులు పన్నెండు సంవత్సరములు అరణ్యవాసము, ఒక సంవత్సరము అజ్ఞాతవాసము గడుపుకొని వచ్చారు. నీవు ఆనాడు యిచ్చిన మాటలు యీనాడు దక్కించుకో"మన్నాడు. ఈ అరణ్యవాసము, అజ్ఞాతవాసము పూర్తి చేసుకొని వచ్చాక మీ రాజ్యము మీకిస్తానని వాగ్దానము చేశాడు ధృతరాష్ట్రుడు. కనుక న్యాయంగా నీవు చెప్పినట్లుగా చేయటం చాలా ధర్మం అన్నాడు, కృష్ణుడు. నీ సత్యాన్ని నీవు నిల్పుకోమన్నాడు. అంతేకాదు, "పాండవులు మహాపవిత్రులు, ధర్మమూర్తులు. నేటికీ కౌరవులపై వారికేమాత్రము కోపముగాని, ద్వేషముగాని లేదు. నేను బయలు దేరి వచ్చే సమయంలో నా రెండు చేతులు పట్టుకొని ధర్మజుడు ప్రార్థించాడు. తానేమైనా తెలిసో తెలియకో చేసిన తప్పులుంటే క్షమించమని కోరమని చెప్పాడు. ఒకవేళ స్వయముగానే వచ్చి తన తప్పులను క్షమించమని కోరటానికి మీరు అంగీకరిస్తే నేను స్వయముగా వెళ్లి అతని పాదములు పట్టుకుని క్షమించమని కోరుతానని చెప్పాడు. కనుక పాండవులపైన ద్వేషము పూనటం న్యాయం కాదు", అని బోధించాడు. ఈ మాటలు విన్న తక్షణమే ధృతరాష్ట్రుడు ప్రశ్నిస్తున్నాడు, "ఒక అన్నదమ్ముల బిడ్డలం మేము. కృష్ణా! నీకు సర్వులూ సమానమే కదా! ఇది ఒక కుటుంబము, ఒక రాజ్యము. కాని, కౌరవులను ఒక దృష్టితో, పాండవులను ఒక దృష్టితో చూడటం యిది నీకు మాత్రం న్యాయమా" అన్నాడు. అక్కడవున్న సత్యాన్ని చక్కగా చెప్పాడు, కృష్ణుడు: "ధృతరాష్ట్రా! పాండవులకు, కౌరవులకు యే మాత్రము పొత్తు కుదరదు. వారిని, వీరిని యే విధముగాను compare చేయటానికి

srisathyasaivedamrutham

వీలుకాదు. పాండవులు ధర్మస్వరూపులు. నేనంటే వారికి ప్రాణ సమానము. వారికి, నాకు వున్న సంబంధబాంధవ్యము యెలాంటిదో చెబుతాను, విన"మన్నాడు. "ఒక దేహమునకు అనేక అంగములుంటున్నాయి. నా దేహము లోపల ధర్మజుడు తలవంటివాడు. అర్జునుడు, నా రెండు భుజములవంటివాడు. నా ఉదరమే భీముడు. నా రెండు పాదములే నకులసహదేవులు". ఇలాంటి దేహములోపల కృష్ణుడు Heartగా వుంటున్నాడు. దేహమునకు, గుండెకు యెలాంటి సంబంధబాంధవ్యము వుందో నాకు, పాండవులకు అలాంటి సంబంధబాంధవ్యమన్నాడు, కృష్ణుడు.

ఈ మాటలు విన్నంతనే దుర్యోధన, దుశ్శాసనుల కండలు కరిగాయి. కండబలము వున్నంతవరకు తనలో క్రొవ్వు వుంటుంది. పొగరు వుంటుంది. దుష్టులైన కౌరవులకు యీవిధమైన గుణములు సహజమే! దుర్యోధన, దుశ్శాసనులు కండకావరముతో సభామధ్యమునకు యేతెంచారు. ఇంతలో ధృతరాష్ట్రుడు తనకు కొంత విశ్రాంతి కావాలని ఆశించాడు. అనగా యేమిటి? ఈ కుమారుల మధ్య సంభాషించటము తనకు యిష్టములేకనా? కాదు, కృష్ణుని ప్రత్యేకంగా పిలిపించుకొని సంభాషించాలని అతని ఆశ. ఒక రూములో పోయి కూర్చున్నాడు ధృతరాష్ట్రుడు. ఆ సమయము పురస్కరించుకొని కృష్ణుడుకూడా అక్కడకు ప్రవేశించాడు. కృష్ణుని రెండు చేతులు పట్టుకొని యీ అంధుడైన ధృతరాష్ట్రుడు ప్రార్థిస్తున్నాడు: "కృష్ణా! నా కుమారులు దుష్టులు, దుర్మార్గులు. నాకు తెలుసు. ఈ పుత్రవ్యామోహమనేది నన్నింత అజ్ఞానములో ముంచుతున్నాది. పాండవులు ధర్మ స్వరూపులే! వారి న్యాయము, వారి సత్యము, వారి ప్రవర్తన ఆదర్శవంతమైనదే! కానీ, నేను నా కుమారులను ధిక్కరించలేకపోతున్నాను", అన్నాడు. అప్పుడు కృష్ణుడు కొంత కఠినంగా చెబుతూవచ్చాడు, "ధృతరాష్ట్రా! పుత్ర వ్యామోహం వుండటం మంచిదే. కాని, మితిమీరిన పుత్రవ్యామోహంవల్ల గతి తప్పుతుంది. మనశరీరమునుండి వెలువడిన మలమూత్రాదులను మనం శుభ్రం చేసుకోవటం లేదా!" అప్పుడు ధృతరాష్ట్రుడు చెప్పాడు, "స్వామీ! అవి జడమైనవి. నా కుమారులు చైతన్యమైనవారు. నా దేహమునుండి పుట్టిన కుమారులపైనే నేనేవిధంగా ద్వేషం తెచ్చుకోవటం?" అందుకు కృష్ణుడు 'దుష్టత్వాన్ని యెలాంటి అభిమానమమకారము లేకుండా త్యజించాలి', అన్నాడు. "పుత్రుడుగాని,

sri sathyasai vachanamrutam

పతిగాని, తల్లితండ్రులుగాని యెవరైనా సరే, దుర్మార్గములో ప్రవేశించినప్పుడు వారిని త్యజించటం అత్యవసరం. సాధ్యమైనంతవరకు వారిని సత్యమైన మార్గములో పెట్టడానికి బోధిస్తూ మొట్టమొదట కృషి సల్పాలి. దీనికి మీరిన తరువాత వారిని త్యజించటమే ధర్మము", అన్నాడు.

ఈ సంభాషణ జరిగిన తరువాత కృష్ణుడు ఇక రాయబారం యేమాత్రం కుదరదని నిశ్చయించుకున్నాడు. ఇక తిరిగి సభలో ప్రవేశించలేదు. రథమునెక్కాడు. వెనుకకు వచ్చాడు. ఇక్కడ పాండవులు యేవిధంగా బాధపడుతున్నారు? "సాక్షాత్తూ భగవంతుడైన కృష్ణుని మా రాయబారిగా యీ కౌరవులదగ్గరికి పంపించితిమే, ఈ దుర్మార్గులు కృష్ణపరమాత్మను యేమి చేస్తారో, యేవిధముగా పరాభవము చేస్తారో, ఎన్ని కష్టములకు గురి చేస్తారో", అని వారు ఆహారము వదిలిపెట్టి చాలా పరితపిస్తున్నారు. కృష్ణుని రథము చూచిన తక్షణమే, కృష్ణుడెక్కడా అని వచ్చారు. దుర్మారులైన కౌరవులు భగవంతుడనే భావము విసర్జించి, యెన్ని విధములైన దుష్టప్రవృత్తులకైనా సిద్ధమవుతారు. కృష్ణునియొక్క నగుమోము చూచిన తక్షణమే పాండవులు చాలా ఆనందించారు. రాయబారమేమైనదని యెవరూ ప్రశ్నించలేదు. 'కృష్ణా! నీవు క్షేమంగా వస్తివా మాకదే చాలు', అన్నారు. తాము కృష్ణుని రాయబారమునకు పంపిన విషయమును పూర్తిగా మరచిపోయారు. వారికి కృష్ణునిపై యెంతో ప్రేమ వున్నది కనుక, కృష్ణుని క్షేమాన్ని అంతగా ఆశించారు. ధర్మజుడు మొదట అతనిని ఆలింగనం చేసుకున్నాడు. తదుపరి అర్జునుడు, భీముడు ఆనంద బాష్పములతో అతనిని ఆలింగనము చేసుకున్నారు. నకుల, సహదేవులు యిద్దరుకూడ వెళ్లారు. ఒకరు ఒకవైపున, యింకొకరు మరొక వైపున కృష్ణుని కరుచుకొన్నారు. ఆ సోదరులు చెబుతున్నారు. సహదేవుడు అందరికంటెను చిన్నవాడు. "నా బావ సుఖముగా తిరిగి వచ్చె, యిదియే పదివేలు. నిన్ను రాయబారిగా పంపటం నాకు యేమాత్రం యిష్టం లేదు. కాని ప్రయాణమై వెళ్లే సమయంలో 'వద్దు' అంటే అది అశుభంగా తోస్తుందో యేమిటో, అందులో పెద్దలైన ధర్మజుడు, అర్జునుడు, భీముడుకూడ అంగీకరించారు. కాని, తిరిగి వచ్చేంతవరకు నాకు భయంగానే వుంది. నాకు సంధి జరిగినా సరియే, యుద్ధము జరిగినా సరియే, నాప్రాణం పోయినా సరే. నాకృష్ణుడు క్షేమంగా వుండాలి", అన్నాడు.

కృష్ణునిపట్ల ఇంతటి ప్రేమతో వుండేటువంటివారు, పాండవులు.

'యద్భావం తద్భవతి'. భక్తుల హృదయాన్ని పురస్కరించుకొని భగవంతుడుకూడను ఆవిధమైన భావంతో వుంటూవుంటాడు. భక్తుల అభివృద్ధి, లోక కళ్యాణము సంకల్పములో వుంచుకొని కృష్ణుడు యిది చెడ్డ అని, యిది చేయతగినదా యిది చేయతగనిదా అనే విచారణ లేకుండా, చిన్న విషయంలోకూడా తాను ప్రవేశిస్తూ వుంటాడు. ఈ లోకము గౌరవ మర్యాదలను తాను యేమాత్రం లక్ష్యం చేయడు. తన కర్తవ్యం భక్త రక్షణ, భక్తులను మనోభీష్టములు నెరవేర్చుటమే! అది అమితమైనది కావచ్చు, అధికమైనది కావచ్చు. మీ దృష్టిలో అది అల్పము, అధికముగాని భగవత్ సృష్టిలో అన్నీ సమానమే. దోషమును పరిహారము చేసే నిమిత్తమై, మనుషులను మంచి మార్గములో పెట్టే నిమిత్తమై అనేక విధములుగా మానవులకు ఆదర్శాన్ని అందించి, వారిని ఉన్నతమైన దైవమార్గములో ప్రవేశపెడుతూవుంటాడు, భగవంతుడు. యిలాంటి చిన్న కార్యములు చేయటమా, యిలాంటి అల్ప కార్యములలో ప్రవేశించటమా అని మీరు భావించవచ్చు. మీరు లోకదృష్టి వుండిన వారు కనుక, మీకు అల్పము, అధికము అనే భేదము. భగవంతునిది ప్రేమ దృష్టి కనుక అల్పము, అధికము అను భేదము యేమాత్రము వుండదు.

అర్జునుడు ఒక సమయములో చాలా నిస్పృహ చెందాడు. జీవించాలని యేమాత్రం అనుకోలేదు. తన జీవితమును ఆ రోజుతో అంతము చేసుకోవాలని సంకల్పించుకున్నాడు. ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. సర్వజ్ఞుడైన కృష్ణుడు దానిని గుర్తించి అర్జునుని గృహమునకు విందుకు పోయాడు. అర్జునునితో "యీనాడు మీ యింట్లో నేను విందు ఆరగిస్తా"నన్నాడు. "అర్జునా! నీకో విషయం చెప్పటానికే నేనింత ఆత్రుతతో వచ్చాను", అన్నాడు. సుభద్ర మొదలైన అందరూ కూర్చున్న సమయం చూసుకున్నాడు, కృష్ణుడు. అర్జునుని ఒక ప్రత్యేకమైన గదికి పిలిపించాడు. తలుపు బిగించాడు. క్రిందికి వంగి అర్జునుని పాదము గట్టిగా పట్టుకున్నాడు. "స్వామీ! యేమిటి యీ అపచారము? నేను యేమిపాపం చేశాను? ఎందుకీ విధంగా మీరు చేస్తున్నార"న్నాడు. "అర్జున, ఫల్గుణ, పార్థ, కిరీటి, శ్వేతవాహన, బీభత్స, విజయ, సవ్యసాచి అనే యిన్ని బిరుదులు నీవు

srisathyasaivachanamrutam

సంపాదించుకుని యీ తుచ్ఛమైన ఆత్మహత్యకు పాల్పడటం మంచిది కాద"న్నాడు, కృష్ణుడు.

పాండవులలో అగ్రగణ్యుడు, అనేక విధములైన కష్టములు నష్టములు దుఃఖములు యెదుర్కొని గాండీవమును సాధించినవాడు, అర్జునుడు. అందువలన కృష్ణుడు అతనిని "నీవు యింద్రియములకు యజమాని కావాలిగాని, యింద్రియములకు దాసుడు కాకూడదు. నీ మనసుకు నీవు దాసుడైనావు, యీనాడు. యింద్రియములకు నీవు దాసుడైనావు. ఇది సరికాదు. ఇంద్రియములు, మనసు నీకు దాస్యము చేయాలి. నీవు వీటన్నిటికి master. కనుక, ఆత్మహత్య అనేది యేనాడు జీవితములో సంకల్పించను అని నాకు మాట యివ్వము"న్నాడు. ఏ విధంగా అనగా "నీ ప్రాణమే నా ప్రాణము. 'ఏకోవసి సర్వభూతంతరాత్మ' అందరి యందు వుండినది నేనే. 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'. సృష్ట్యాదినుండి నేను సర్వజీవులయందు ప్రాణరూపంలో వుంటున్నాను. కనుక అర్జునా! ఆత్మహత్య అనగా నీ ప్రియమైన కృష్ణుని నీవు చంపినవాడవౌతావు" అన్నాడు. అప్పుడు అర్జునుడు "అయ్యో స్వామీ! యిన్ని విధములైన అంతరార్థములను గుర్తించుకొనలేక అమాయకుడనైనాను. అజ్ఞానిని క్షమించుము. ఇంక జీవితములో నేను యేనాడు యిలాంటి సంకల్పము చేయను" అన్నాడు. ఈ విధముగా కృష్ణుడు పాండవులను ప్రతిక్షణము సంరక్షించే నిమిత్తమై అనేక విధములైన చేయరాని అల్ప కార్యములలో ప్రవేశించాడు.

ఒకనాడు ఘోరమైన యుద్ధము జరుగుతూవుంది. ఆనాడు సాయంకాలము భీష్ముడు ప్రతిజ్ఞ పట్టాడు. అంటే, అది నెరవేరక తప్పదు. 'రేపటి సూర్యాస్తమానములోపల పాండవులందరిని హతమారుస్తా'నని ఒక భీషణ ప్రతిజ్ఞ చేశాడు. పాండవులకు తెలుసు, భీష్మ ప్రతిజ్ఞ నెరవేరక తప్పదని. ఈ వార్త ద్రౌపది చెవిలో పడింది. 'అయ్యో! రేపటినుండి నా గతి యేమౌతుంది? ఉన్నది ఒక్కటే మార్గము' అనుకుని ఆమె 'కృష్ణా! కృష్ణా! కృష్ణా! ఆపద్బాంధవా!' అని ప్రార్థించింది. ఆ రాత్రి కృష్ణుడు అక్కడకు చేరుకున్నాడు. కృష్ణుని పాదములుపట్టి అనేక విధములుగా ప్రార్థిస్తూవచ్చింది, ద్రౌపది. కంటిధారలు కాలువలై

పారుతూవచ్చాయి. అప్పుడు కృష్ణుడు చెప్పాడు "అమ్మా! యింక యేమాత్రం దీనికి విరుద్ధంగా చేయటానికి వీలుకాదు. అతను భీష్ముడు. పరమభక్తుడు. అతని వాక్యాన్నికూడను నేను నెరవేర్చాలి. కేవలం సామాన్యమైన మానవుడే కాదు. ధాటియైన గంగాపుత్రుడు. అయినప్పటికి నేను నీకు కొన్ని యుక్తులు బోధించటానికి ప్రయత్నిస్తాను" అన్నాడు. భీష్ముడు ప్రతిజ్ఞ అయితే చేశాడు కాని, ధర్మమూర్తులైన పాండవులను సంహరించటానికి అతని మనసు అంగీకరించలేదు. చాలా మధనపడ్డాడు. నీరు త్రాగలేదు, ఆహారం పుచ్చుకోలేదు. నిద్రరాక అటుయిటు తిరుగుతున్నాడు, తన గుడారంలో. అప్పుడు కృష్ణుడు ద్రౌపదికి చెప్పాడు "నేను చెప్పినట్లు చేయి. నీవు ముందు నడు, నేను వెనుక వస్తాను, భీష్ముని గుడారం దగ్గరకు వస్తాను. అక్కడ నీవు కాళ్లకు తొడుక్కున్న చెప్పులు వదిలిపెట్టు. నేను వాటిని నా చంకలో పెట్టుకుని నడుస్తాను. నీవు తక్షణమే వెళ్లి భీష్ముని పాదములపైని పడు" అన్నాడు. ఈ విధంగా ద్రౌపది భీష్ముడు యేదో విధమైన యోచనలో వుండే సమయాన్ని పురస్కరించుకొని వెళ్లి అతని పాదములపై పడింది. భీష్ముడు తన సహజ ధోరణిలో 'ధీర్ఘ సుమంగళీ భవ', అని ఆశీర్వదించాడు. తన పాదములపై వ్రాలిన స్త్రీ ద్రౌపది అని అతనికి తెలియదు. వెంటనే ద్రౌపది "పితామహా! నేను దాని నిమిత్తమే మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. దానికోసమై వచ్చాను" అంది. అతని మనసు చాలా వికలమై పోయింది. "నిన్నటి దినము నేను చేసిన ప్రతిజ్ఞ యేమిటి, యీనాడు ద్రౌపదికి యిచ్చిన వాగ్దానమేమిటి? రెండును పరస్పర విరుద్ధముగా తోస్తున్నాయి", అని కొంత యోచించి ద్రౌపదిని దగ్గరకు రమ్మని పిలిచి "బిడ్డా! యీ యుక్తిని నీకు చెప్పిన వారెవరు", అని అడిగాడు. ఈ లోపున కృష్ణుడు చంకలో ఆమె చెప్పులు పెట్టుకొని లోపలకు ప్రవేశించాడు. ఆయనను చూచిన భీష్ముడు "కృష్ణా! లీలలంటే నీకే చెల్లు. భక్త సంరక్షణ నీకే చెల్లు. నీ యుక్తులు, ప్రయుక్తులు నీకే చెల్లు. లోకులు పరులను బాధించే నిమిత్తమై యుక్తులు పన్నుతారు. కానీ నీవు లోకాన్ని రక్షించే నిమిత్తమై యుక్తులు పన్నుతావు. కృష్ణా! నీకు నీవే సాటి", అన్నాడు. ఈ వాగ్దానము యిచ్చిన తరువాత భీష్మునికి మనసులో ఆందోళన తగ్గి చాలా ఆనందముగా వుంది. భీష్మునికి అప్పుడు వేసింది, ఆకలి. "కృష్ణా! నీవు యేదో తెచ్చావే, నాకు కొంచెం యిమ్ము" అని అడిగాడు భీష్ముడు. కృష్ణుడు అప్పుడు తన

అంగవస్త్రములో చుట్టుకున్న చెప్పులు క్రిందపెట్టాడు. "ఏమిటి స్వామీ! యెక్కడవీ చెప్పులు?" అని, అడిగాడు భీష్ముడు. "భీష్మా! నీవు యేదో యోచన చేస్తూ అటూయిటూ తిరుగుతున్నావు నేను చూశాను. ఈ ఆడవారు వేసుకొనే చెప్పులు కొంత ధ్వనిని యిస్తూ వుంటాయి. అందులో Royal family వాళ్లు వేసుకొనే చెప్పులు మరింత శబ్దాన్ని యిస్తూవుంటాయి. ఈ శబ్దము విన్న తక్షణమే నీవు ఇటు, అటు చూడవచ్చు. కనుక ఆ శబ్దము నీకు వినపించకుండా వుండే నిమిత్తమై దీనిని నేను చంకలో పెట్టుకొని వచ్చాను", అన్నాడు కృష్ణుడు. అప్పుడు భీష్ముడు కంటి ధారలు కారుస్తూ "భక్త సంరక్షణ నిమిత్తమై భగవంతుడు భక్తుల చెప్పులనుకూడ మోస్తాడని ఇప్పుడు నేను తెలుసుకున్నాను. ఓ కృష్ణా! నీకు సాటి నీవే"నని ప్రార్థించాడు. కనుక, భగవంతుడు యిది చేయవచ్చును, యిది చేయరాదు అనేది ఒక్కటీ లేదు. ఎక్కడ చూచినా తానే వుండినప్పుడు యేది చేయవచ్చును, యేది చేయరానిది? యేది చేసినాకూడ తన నిమిత్తమై కాదు. దైవము మానవులకు ఆదర్శాన్ని నిరూపించే నిమిత్తమై అనేక రకములైన లీలలు ప్రదర్శిస్తూ వుంటాడు.

**చెప్పినట్లు చేయడానికి సిద్ధంగా ఉండాలి**

ఒకానొక సమయములోపల కృష్ణుడు పాండవులతో సంభాషిస్తూవచ్చాడు. కాని, అందులో అర్జునుడు కొన్ని విషయములు అంగీకరించలేదు. అంగీకరించక పోయినప్పుడు కృష్ణుడు కొంచెం కోపము వచ్చినట్లుగా నటించాడు. ఆ సభను విడచివెళ్లాడు. కొంత దూరము పోయాడు. ఈ లోపున భీముడు, ధర్మజుడు, నకుల, సహదేవులు అర్జునునిపై బడ్డారు. "మన ప్రాణసమానమైన కృష్ణుని పరాభవము చేస్తావా! యీ సభలోపల అతనిని అవమానముచేస్తావా? అతని ఆజ్ఞను యెందుకు పుల్లంఘించితివి", అని అతనిని అనేక విధములుగా విమర్శిస్తూవచ్చారు. సోదరుల విమర్శలను భరించకొనలేక అర్జునుడు కృష్ణుని లోలోపల ప్రార్థించుతూవచ్చాడు. ఉన్నట్టుండి బయటకు వెళ్లిన కృష్ణుడు వెనుకకు తిరిగి వచ్చాడు. మానవుల స్వభావము చంచలము. అభిమానమధికము. అందులో తెలివితేటలు కల్గినవారికి అమితంగా అభిమానము. ఈ తెలివితేటలు కల్గినవారు దేనినీ విశ్వసించరు. "నీకు తెలివితేటలు అధికంగా వుండటంచేత నీవు ముందు వెనుకలు యోచించక

srisathyasaivachanamrutam

పొరపాటుపడ్డావు. ఇకపై నీ తెలివితేటలను వుపయోగపెట్టవద్దు. దైవాజ్ఞను శిరసావహించి నీవు నడుచుకో" అని బోధించాడు, కృష్ణుడు. అర్జునుడు "కరిష్యే వచనం తవ! కృష్ణా! యింక నీ ఆజ్ఞను శిరసావహిస్తాను" అన్నాడు. అప్పుడు కృష్ణుడు "ఇప్పుడు నీవు నాకు భక్తుడవు" అని అంగీకరించాడు. అంతేకాని, చెప్పినట్లు చేస్తానని చెప్పి, చేయకుండా పోతే యింతకంటె దైవద్రోహం మరొకటి లేదు. యీనాడు చెప్పేవారు అందరూ వుంటున్నారు. కానీ చేసేవాడు ఒక్కడూ లేడు. మనం చెప్పినట్లు చేయడానికి సిద్ధంగా వుండాలి. అప్పుడే దైవానుగ్రహం అందుకోటానికిగాని, పొందుకోటానికిగాని అర్హులమౌతాము.

**భగవంతుడు ఏమి చెప్పినా, ఏమి చేసినా భక్త సంరక్షణ కొరకే!**

కడపటి దినము యుద్ధము పూర్తయింది. కర్ణుడు వేసిన అస్త్రములచేత సైన్యమంతా కూలబడిపోయింది. ఆనాడు యుద్ధము నిల్పివేశారు. పాండవులకు విజయము, కౌరవులకు అపజయము అన్నారు. ఆనందోత్సాహముతో వస్తున్నారు యింటికి అర్జునుడు, కృష్ణుడు. ఇక్కడ అర్జునునియందు కొంత అహంకారము ప్రవేశించింది. ఈనాడు యుద్ధములో నేను విజయాన్ని సాధించుకున్నాను అనుకున్నాడు. తాను రాజు, కృష్ణుడు కేవలం ఒక సారథిగా భావించుకున్నాడు. ఈనాటి కాలానుగుణ్యముగా యెవరైనా కారు డ్రైవరు ముందు దిగి తలుపు తీసిపట్టుకున్నప్పుడే యజమాని క్రిందికి రావటము. ఇలాంటి పద్ధతి ఆనాడుకూడా వుండేటువంటిది. ఆ సమయంలో అర్జునుడు తాను ఒకరాజు, కృష్ణుడు కేవలం ఒక డ్రైవరు అనుకున్నాడు. కృష్ణుడు చెప్పాడు 'బావా! దిగ'మన్నాడు. కానీ యీ అహంకారము లోపల ప్రవేశించింది కనుక అర్జునుడు 'బావా! మీరు ముందు దిగండి' అన్నాడు. 'లేదు, లేదు నీవే ముందు దిగు' అని కృష్ణుడు చెప్పాడు. ఇరువురికి వాదం జరుగుతూవచ్చింది. అర్జునునికి భయమేర్పడింది. సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అయిన కృష్ణుడు కడపటికి యేంచేస్తాడో యేమోననుకుని, నోరు మూసుకుని రథమునుండి క్రిందకు దిగాడు. అందరిని లోపలకు వెళ్లమని చెప్పాడు కృష్ణుడు. 'ఏమి యీ వింత! వరండాలోకూడా నిల్చోటానికి వీల్లేదా', అన్నాడు అర్జునుడు. 'వెళ్లు, వెళ్లు' అని చెప్పి గర్జించాడు, కృష్ణుడు. అందరూ లోపలికి వెళ్లారు. అర్జునుడు కిటికీలోనుంచి చూస్తున్నాడు.

srisathyasaivachanamrutam

కృష్ణుడు ఒక్కతూరి క్రిందకు దుమికినాడు. కృష్ణుడు దూకిన తక్షణం రథం కాలిపోయింది. అర్జునుడు చూచాడు. 'ఏమిటి స్వామీ! యీ విచిత్రము!' అని ఆశ్చర్యపోయాడు. "అందుకోసమేనయ్యా, నిన్ను లోపలికి పొమ్మంది. ఈనాడు కర్ణుని అస్త్రములన్నీకూడను నాకాళ్ల క్రింద పెట్టుకున్నాను. నేను కనుక ముందు దిగితే రథము కాలిపోయేది. నీవును కాలిపోయేవాడవు. పాండవులయొక్క క్షేమం నిమిత్తమై యిన్ని రకములైన ఆటలు ఆడుతున్నాను', అన్నాడు. భగవంతుడు యేమి చేసినా, యేమి చెప్పినా, యేది చూపినా భక్త సంరక్షణ నిమిత్తమైకాని తనస్వార్థంకాదు. కానీ, అల్పభావములు కల్గినటువంటి వారు దీనిని అర్థం చేసుకొనలేరు. భగవంతుడు, భగవంతుడు అనుకున్నంత మాత్రమున మన భక్తి ప్రవృత్తులు అధికంకావు. భగవంతునియందు ఆదర్శవంతమైన మానవత్వాన్ని మనం గుర్తించాలి. అప్పుడే మానవజన్మ సార్థకమవుతుంది.

**మనసుతోకూడినవాడే మనిషి**

మానవతాశక్తిని మనము పోషించుకోవాలి. మానవాకారము వుందికాని మానవతావిలువలులేవు. ఈ మానవతావిలువలు మనం సంపాదించినప్పుడే మనం మానవులమవుతాము. మనం 'మనిషి' అనే పదమును వుచ్చరిస్తున్నాము. ఈ 'మనిషి' అనే పదము యెక్కడనుండి వచ్చింది? మనసునుండి వచ్చినవాడు కనుక యితనికి మనిషి అని పేరు వచ్చింది. మనసుతోకూడినవాడే మనిషి. మనసంటే యేమిటి? సంకల్పములయొక్క చేరికే మనస్సు. ఈ సంకల్పవికల్పము లెక్కడనుండి వచ్చినవి? నిత్యజీవితములో మనం ఆచరించే కృత్యములవల్ల వచ్చినవి. కనుక, ఆచరణ శుద్ధమైనప్పుడే మన మనసు శుద్ధమవుతుంది. మనసు శుద్ధమైనప్పుడే మనిషి మనిషిగా బ్రతకగలడు. కనుక, మనిషంటే కేవలం ఆకారం కాదు. మనసుయొక్క స్వరూపమే మనిషి. కనుక, యీ మనసుయొక్క సంకల్పాన్ని మనం పవిత్రమైన సంకల్పంగా నిరూపించుకోవాలి. ఈ సంకల్పముచేత శుద్ధమైన ప్రవర్తనలో మనం ప్రవేశించాలి. నడతను బట్టి నీతి. పవిత్రమైన, పరిశుద్ధమైన, పరోపకార సంబంధమైన యీ మూడింటి సమ్మిళితమైన భావస్వరూపమే మన మనస్సు. మన నడతలో పవిత్రత వుండాలి. పరోపకార సంబంధమైనదిగా వుండాలి. మానవత్వాన్ని



srisathyasaivachanamrutam

వికసింపచేసుకోటానికి ప్రయత్నించాలి.

**భగవంతుడు భౌతికదేహమును ధరించటంచేత మానవులకు భౌతికాదర్శమును నిరూపిస్తాడు**

భగవంతుడు మానవాకారములో మానవుల మధ్య జన్మిస్తాడు. ఈ మానవాకారం ధరించిన దైవమందు, మానవాదర్శమును మనము దర్శించినప్పుడే మనము సరైన భక్తులమౌతాము. కేవలం పూజించటం ప్రధానం కాదు. ఆరాధించటం ప్రధానము కాదు. అర్పితం గావించటం ప్రధానం కాదు. ఆచరించి, నిరూపించాలి. ఆచరణలో అభివృద్ధిగావించుకొని ఆదర్శాన్ని నిరూపించుకోవాలి. కృష్ణుడు నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, లౌకిక, వైజ్ఞానిక సంబంధమైన మార్గములన్నింటియందు మానవులకు ఆదర్శాన్ని నిరూపిస్తూ వచ్చాడు. ఇది ఒక్క దైవత్వమునకే తప్ప అన్యులకు సాధ్యంకాదు. అట్టి సర్వాదర్శకుడైన దైవత్వాన్ని దైవముగా భావించి మానవునిగా ఆదర్శవంతమైన ప్రక్రియలను మనం అనుసరించాలి. పిల్లలతో ఆడతాడు, పాడతాడు; పెద్దలతో బోధిస్తాడు, అనుసరిస్తాడు. ఆయా దేశకాలపరిస్థితులను పురస్కరించుకొని తను ప్రవర్తిస్తాడు. దేశకాలములకు అతీతమైనప్పటికి కాలానుగుణ్యముగా తాను ప్రవర్తించటానికి ప్రయత్నిస్తాడు. అధికారమునకు, త్రిలోకములకు, త్రిగుణములకు అతీతమైనవాడు భగవంతుడు. కాని, భౌతికదేహము ధరించటముచేత మానవులకు భౌతికమైన ఆదర్శమును నిరూపించాడు.

**అభిమాన, మమకారములనే నివురును తొలగిస్తే స్పష్టమైన ఆకారము గోచరిస్తుంది**

'నేను మానవుడను, మానవుడను' అని అనుకోవటం కేవలం అర్ధసత్యం మాత్రమే! 'నేను పశువునుగాను' అనేటువంటిది మరొక half truth. ఈ రెండు అర్థములు చేరితేనే నిజసత్యమౌతుంది. కనుక, 'నేను మానవుడను' అనే విశ్వాసము ఒకవైపున, నేను పశువును కాను అనే విశ్వాసము యింకొకవైపున, ఈ రెండిటిని మనం జతపరచాలి. ఈ రెండింటియొక్క చేరికయే మానవుడు. అప్పుడే మానవతా విలువలు అభివృద్ధి అవుతాయి. నేను మానవుడు, మానవుడు, మానవుడు అని అనుకుంటూ పశువు మాదిరి ప్రవర్తిస్తే

మానవుడెట్లు అవుతాడు? దైవము యెక్కడను ప్రత్యేకముగా లేదు. ఈ రూపములన్నీ దైవములే! అగ్నివుంది. కొంత సేపయ్యేటప్పటికి ఆ అగ్నిపై నివురు ఏర్పడుతుంది. అగ్నినుండి పుట్టిన ఆ నివురు అగ్నినే కప్పివేస్తుంది. అయితే ఆ నివురు యెక్కడనుండి వచ్చింది? అగ్ని నుండే వచ్చింది. అగ్నినే మూసింది. అదే రీతిగా అంతా దైవస్వరూపమనే అగ్నిని మానవత్వంయొక్క అభిమానమనే నివురు కప్పివేసింది. కనుక, యీ అభిమాన మమకారములనే నివురును తీసివేస్తే మన ఆకారము స్పష్టముగా తెలుస్తుంది. యీనాడు చేసే 'శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాద సేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహం, ఆత్మ నివేదనమ్' అనే సాధనలన్నీ కేవలం మన అనాత్మను దూరము చేసుకొనే నిమిత్తమే! ఆత్మను సందర్శించుకొనే నిమిత్తము కాదు.

**మనసుకు పట్టిన మాలిన్నాన్ని తుడిచివేస్తే నీవే దైవంగా నిరూపిస్తావు**

చాలామంది దైవ సాక్షాత్కారం కావాలంటారు. సాక్షాత్కారమంటే యేమిటి? కప్పబడినదంతా తీసేస్తే అసలు స్వరూపం కన్పిస్తుంది. ఎక్కడికో పోయి నీవు సాధన చేయనక్కరలేదు. నీవు చేసే సర్వసాధనలుకూడను దైవం కోసం కాదు. నీ మనసుకు పట్టిన మాలిన్యాన్ని తుడిచి వేసుకోవటానికి. మనసుకు పట్టిన మాలిన్యాన్ని తుడిచి వేస్తే నీవు దైవంగానే నిరూపిస్తావు. అనేక మంది ఆత్మాన్వేషణ, ఆత్మాన్వేషణ అంటారు. అన్వేషణ చేయనక్కర లేదు. ఎందుకనగా 'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః'. ఎక్కడ చూచినా నారాయణుడే వున్నప్పుడు యింక యెక్కడ పోయి వెతికేది? సర్వత్రా వుండినది పరమాత్మయే! అతనిని వెతకటం యెక్కడ? తనను తాను మరచినవానికే దైవవిశ్వాసము కుదరదు.

**ఆత్మ, అహం, మనస్సు, వాక్కు అన్నీ ఆత్మతత్త్వములే!**

ఈ అహంకారమనేది మానవులలో ప్రవేశించి అనేక విధములుగా మానవుని తబ్బిబ్బు చేస్తుంది. ఈ అహంకారమెక్కడనుండి వచ్చింది? ఆత్మనుండియే పుట్టినది. ఈ అహంకారమునుండి పుట్టింది, మనసు. ఈ మనసునుండి పుట్టినదే వాక్కు. కాబట్టి ఆత్మకు కుమారుడు అహం. మనసు అనేటువంటిది మనుమడు. ఈ మనసుకు వాక్కు అనేది

మునిమనుమడు. కనుక ఆత్మ, అహం, మనసు, వాక్కు అన్నీకూడ ఆత్మ తత్త్వములే. కనుక, వాక్కు అనేది కేవలం మన వాక్కుగా భావించకూడదు. వాక్కును 'ఋగ్వేదము' అన్నారు. ఈ వాక్కు అనేది భగవంతుని మునిమనుమడు. ఈ వాక్కులోకూడను భగవంతుని గుణగణములు వుంటాయి. ఈ వాక్కునకు తండ్రియైన మనసునందు భగవంతుని గుణగణములే వుంటాయి. ఈ మనసుకు తండ్రియైన అహమునందుకూడను భగవంతుని గుణగణములే వుంటాయి. తండ్రి ప్రోపర్టీ కొడుకుకి వస్తుంది. కొడుకు ప్రోపర్టీ మనుమనికి పోతుంది. కాబట్టి కుమారుడైన అహంకు, మనుమడైన మనసుకు, మునిమనుమడైన వాక్కుకు యీ భగవంతుని ఆస్తియే పంచుకుంటూ వస్తారు.

ఒక చిన్న ఉదాహరణము చూడండి. మనకు దేహము కన్పిస్తుండాది. ఇవేమో చేతులంటున్నాము. యివి రెండు కాళ్లు. ఇది తల. ఇది పొట్ట. ఇంకా దీనికి యెన్నెన్నో ఉపాంగములంతా వున్నాయి. ఈ సర్వాంగములు తమయొక్క శక్తిసామర్థ్యములు ప్రదర్శించాలంటే అన్నిటికి వున్న ఒకే ఒక శక్తి, సర్వాంగములయందు సమంగా ప్రవహించేది, రక్తము ఒక్కటే! ఒక చేతిని మనం కొట్టివేయాలనుకుంటే ఆ చేతిద్వారా చాలా రక్తం వ్యర్థమవుతుంది. మిగిలిన అంగములు బలహీనమవుతాయి. అదే విధముగా దైవత్వమునుండి వచ్చిన సంపద, సత్యధర్మశాంతిప్రేమఅహింసలు. ఈ మానవతా విలువలు మనం కాపాడుకోవాలంటే దైవముయొక్క విలువలన్నింటిని మనము ప్రవేశపెట్టుకోవాలి.

**విశ్వస్వరూపుడైన భగవంతుడు అణుస్వరూపుడై మన దేహమునందు ఉంటున్నాడు**

దీనినే హనుమంతుడు చక్కని ఆదర్శముగా నిరూపిస్తూ వచ్చాడు: "రామా! శారీరకంగా నీవు ప్రభువు, నేను దాసుడను. జీవతత్త్వములో నీవు బింబము, నేను ప్రతిబింబము. ఆత్మతత్త్వములో నీవే నేను, నేనే నీవు", అని. దానినే అప్పుడప్పుడు నేను చెప్తూ వుంటాను. You are not one person, but three. The one you think you are, the one others think you are and the one you really are. కనుక, మనము కేవలము అల్పులమైన మానవులగాను, హీనమైన మానవత్వంగానూ భావించరాదు. మనం ప్రార్థన చేస్తూ

srisathyasaivachanamrutam

వుంటాము. ఈ Hostel Boys అందరకు తెలుసు, భోజనం చేసేటప్పుడు ప్రార్థన చేస్తాము:

**బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్**
**బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మ కర్మ సమాధినా**

బ్రహ్మకు మనం అర్పితము చేస్తున్నాము. ఎక్కడ వున్నాడు బ్రహ్మ అనే ప్రశ్న వేసుకుంటే

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః.**

వైశ్వానరుని రూపములో అందరియందు వుంటున్నాను అని చెపుతున్నాడు, భగవంతుడు. నీవు భుజించిన ఆహారమును జీర్ణముగావించి సర్వాంగములకు సప్లై చేస్తున్నాడు. నీకు నీవు ప్రశ్న వేసుకో, Where is god? అని. 'అహం వైశ్వానరో భూత్వా' అని నీకు జవాబు వస్తుంది. దైవము సర్వులయందు వున్నాడు. హిరణ్యగర్భునకు వైశ్వానరుడని పేరు. కనుక, వైశ్వానర రూపమనగా భగవంతుడే! విశ్వస్వరూపుడైనటువంటివాడు, అణుస్వరూపుడై నీ దేహమునందు వుంటున్నాడు. చంద్రునకు, మనసుకు యెటువంటి సంబంధముందో భగవంతునికి, వైశ్వానరునకు అదే సంబంధముంటున్నది.

**విశ్వాసమే మనకు నిజమైన శ్వాస**

ఎన్ని దినములు, యెంత కాలము మనము యీ విశ్వములో జీవించి యెన్ని పనులు చేసినప్పటికి దైవవిశ్వాసమే లేకపోతే సర్వము బూడిద యగును. విశ్వాసమే మనకు నిజమైన శ్వాస. ఆ విశ్వాసముతోనే మనం సమాజములో జీవించాలి. అందరూ ఒకే దైవముయొక్క సంతతి అని భావించాలి. సమైక్యతను, సమర్థతను సాధించాలి. ఈ unity ని మనం సాధించినప్పుడే మనలో purity అనేది అభివృద్ధి అవుతుంది. ఈ unity, purity, divinty కి మన ప్రవర్తనలే ప్రధానమైనటువంటివి. మనజీవితములో కమ్యూనిటీ అనే దానికి చోటు యివ్వకూడదు. మన unity మన reality యేనాడు ఛిన్నాభిన్నమవుతుందో అప్పుడే కమ్యూనిటీ మనకు వస్తుంది. ఈ కమ్యూనిటీ వుండినవారే నీచులు. Unity వుండినటువంటివాడే ధీరుడు. మనమంతా ఒకే మానవ జాతికి చెందినవారము. Caste of Humanity, religion of Love, language of Heart యీ మూడు మనము దృష్టిలో పెట్టుకోవాలి. అప్పుడే మనము జగత్తుకు ఆదర్శవంతమైన జీవితమును అందిస్తాము. మన

sri sathyasai vachanamrutam

సంకుచితమైన భావాల్నంతా దూరము నెట్టాలి. సన్నిహితమైన సంబంధబాంధవ్యములు మనము పెంచుకోవాలి. మానవత్వాన్ని అభివృద్ధి గావించుకోవాలి. ఇదియే కృష్ణుడు చాటిన ప్రధాన సందేశము. భగవంతుని ఆటలు, మాటలు అన్నీ ఉపదేశములే! దీనిని యెవరు అలక్ష్యము చేస్తారో వానికంటె హీనుడు మరొకడు ఉండడు. వాడు అన్ని దురవస్థలకు గురౌతాడు.

**ఆధ్యాత్మికములో తప్ప అన్యమార్గములో ఏమాత్రము శాంతిలేదు**

ఈనాడు ప్రపంచము వైజ్ఞానికముగా ఎంతో అభివృద్ధి గాంచినది. యెన్ని విధములైన అభివృద్ధి గాంచినప్పటికిని మానవుని భద్రతకుగాని, శాంతికిగాని యేమాత్రము వుపయోగము కాలేదు. ఒక్క ఆధ్యాత్మికములో తప్ప అన్యమార్గములో యేమాత్రము శాంతి లేదు. మనము సమాజములో యెన్నియో నేర్చుకొనవలసి వుంది. సమాజముకూడను మననుండి యెన్నియో నేర్చుకోవలసినవి వున్నాయి. యీ సంబంధాన్ని మనము పెంచుకోవాలి.

ఒక చిన్న ఉదాహరణము. ఐన్‌స్టీన్ మహా విజ్ఞానవేత్త. అతను ఉండే వీధిలోపలనే ఒక బాలిక ఉండేది. ఆమె mathematics లో యెప్పుడూ ఫెయిల్ అయిపోయేది, పాపం! ఫెయిలవటం, మరల కట్టుకోవటం యీ విధముగా తాను బాధపడుతూ వచ్చింది. ఎవరో చెప్పారు, 'అమ్మా! నీ వీధిలోనే మంచి లెక్కలు తెలిసిన ఐన్‌స్టీన్ వున్నాడే, అతని దగ్గరకుపోయి నేర్చుకోకూడదా!' అని సలహా యిచ్చారు. ఆ అమ్మాయి 'ఓహో! నాకేదో మంచి వుపాయం చిక్కింది' అని ఐన్‌స్టీన్ యింటికి పోయింది. బయటనుంచుంది. ఆయన వరండాలో కూర్చుని పేపరు చదువుతున్నాడు. ఆ బాలికను చూచి 'come on, come on' అని పిల్చాడు. 'సార్! మీరు mathematics లో చాలా ప్రవీణులట! నేను mathematics లో అనేక పర్యాయములు తప్పాను' అని తన గోడు అంతా వినిపించుకుంది, పాపం! సరే, ఆయన అంగీకరించాడు, తక్షణమే. 'ఫలాని టైమ్‌కి వచ్చివుండు, నేను నీకు tuition చెబుతానన్నాడు. ఆమె చాలా ఆనందించింది. అతని చేయి గట్టిగా పట్టుకుని పాపం కంటినీరు కార్చింది. 'నాకు యింత ధైర్యము యిచ్చినవారు యెవరు లేరు. అందుచేత

srisathyasaivachanamrutam

నాజీవితముపై విరక్తి చెందాను', అంది. ఆమెకు ధైర్యసాహసాలను యిచ్చి పంపించాడు. నిత్యము ఐన్‌స్టీన్ వద్దకు వచ్చి tuition చెప్పించుకునేది. ఐన్‌స్టీన్ చాలా చక్కగా చెప్పేవాడు. ఈ విధంగా వస్తూపోతూ వుండటం చూచింది, ఆ బిడ్డతల్లి. అతను గొప్పవాడు. అలాంటివాని దగ్గరకు నాబిడ్డ పోయి అతనిని లేనిపోని హింసపెడుతున్నాదే అని ఆబిడ్డను కొంచెం కోప్పడింది. ఒక రోజు ఐన్‌స్టీన్ యింటికి వచ్చి ఆ బిడ్డతల్లి ఐన్‌స్టీన్‌ను క్షమాభిక్ష వేడుకుంది. 'సార్! నా బిడ్డ తెలియకుండా యీ విధముగా మీకు శ్రమయిస్తూ వచ్చింది. నా బిడ్డను క్షమించాలి' అని చెప్పి ప్రార్థించింది. అప్పుడు ఐన్‌స్టీన్ 'నాకు యేమి trouble యిచ్చింది?', అని అడిగాడు. 'కేవలం లెక్కలు నేర్చుకోటానికి మీ దగ్గరకు రావలెనా? యింత పెద్దవారిని యీవిధముగా శ్రమపెట్టటము యేమిటి?' అని బాధపడింది, ఆ తల్లి. అప్పుడు ఐన్‌స్టీన్ చెప్పాడు 'చాలా పొరపాటు. నేనుకూడ ఆ అమ్మాయినుండి యెన్నో నేర్చుకుంటున్నాను.' నానుండి ఆ అమ్మాయి యెన్ని నేర్చుకుందో ఆ అమ్మాయినుండి నేనుకూడ అన్ని నేర్చుకున్నాను', అన్నాడు. ఈ ఐన్‌స్టీన్‌కు లౌకిక విషయాలు ఏమి తెలియవు. ఆ అమ్మాయికి చాలా లోకజ్ఞానము వుంది. అప్పుడు ఐన్‌స్టీన్ General Knowledge, commonsense ప్రతి ఒక్కరికి అవసరమని గుర్తించాడు. 'ఈమెకు నేను లెక్కలు చెప్పటం యేమిటి, నేను పెద్దవాడను' అనే ఆలోచనలు అతనిలో లేవు. ఆయన చాలా గొప్పవాడు. 'Tell me your company, I shall tell you who you are' అని ఐన్‌స్టీన్ చెప్పేవాడు.

**మానవత్వాన్ని పవిత్రమైన వరప్రసాదంగా భావించాలి**

దైవత్వములోని ఆదర్శములను మనం అందుకోవాలి. పూజించటం ప్రధానం కాదు. దేవుడు యేదో ఒక ప్రత్యేక స్థలములో మాత్రమే లేడు. అంతటా వున్నాడు. అందుకే నేను తరచు చెప్తూవుంటాను. ఒక చిత్ర పటాన్ని దేవునిగా భావించి పూజించవచ్చుగాని దేవుని చిత్రపటముగా భావించడం సరికాదు. ఒక రూపముకోసం చిత్రపటాన్ని పెట్టుకుంటున్నామే కాని చిత్రపటమే దేవుడు కాదు. నీవే దైవం. చూసేది తానే, చేసేది తానే, అనుభవించేది తానే! ఇట్టి సంకల్పాన్ని అనుభవిస్తే యెంతో తృప్తిని పొందుతాము. 'వేదం నేనే,

sri sathyasai vahini

వేదాంతవేత్తను నేనే!' సర్వం వేదమయమ్. 'దైవం మానుష రూపేణా'. దైవత్వం మానుషరూపంతో వచ్చింది. కనుక మానవత్వాన్ని పవిత్రమైన వరప్రసాదంగా భావించాలి. ప్రసాదాన్ని పారవేసేవాడు మూర్ఖుడు. అనుభవించేవాడు ధన్యుడు. దైవమిచ్చిన మానవత్వాన్ని సార్థకంగావించుకున్నవాడే ధన్యుడు. ఐన్స్టీన్ కోట్లు గడించాడు. కడపటికి అతనికి విరక్తి కలిగింది. తన్ను తాను తెలుసుకోవటమే ప్రధానమని గుర్తించాడు. తనకు, దైవానికి యెంత దూరమో దైవానికి, తనకు అంతే దూరం. నీకు నీవెంత దూరం, దగ్గరేకదా! దైవానికీ నీకూ కూడ అంతే దగ్గర. 'దూరాత్ దూరే అంతికేచ' అని చెప్పింది వేదము. 'నేను యెంత దూరంలో వున్నానని భావిస్తే అంత దూరంలో వుంటాను. ఎంత దగ్గరగా ఉన్నానని భావిస్తే అంత దగ్గరగా వుంటాను. దూరానికి, దగ్గరకు మీ భావమే కారణం కాని నేను కాదు'. మానవుని భావములే భగవంతుని దూరం చేసుకొంటున్నాయి. ఒక్క మనసును చేసుకుంటే సర్వమూ సరిపోతాయి.

**(తేదీ 16-08-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam